హైదరాబాద్ వార్త



# ఫ్యూచర్ సిటీ కొత్త బాస్‌గా తరుణ్ జోషి ,మల్కాజిగిరి కొత్వాల్‌గా సుమతి



హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:
హైదరాబాద్ శివార్లలోరి రెండు పోలీసు కమిషనరేట్లకు కొత్త కమిషనర్లు నియమితులయ్యారు. ఇటీవలే ఏ ర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్‌గా ఐజి ర్యాంకులో వున్న డాక్టర్ తరుణ్ జోషి నియమితుల య్యారు. 2004 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన తరుణ్ జోషి ప్రస్తుతం ఎసిబి డైరక్టర్‌గా వున్నారు. ఇంతకు ముందు ఆయన హైదరాబాద్‌లోని దక్షిణ మండల డిసిపిగానూ, ఎస్‌బి జాయిం ట్ సిపిగానూ, పూర్వపు రాచకొండ పోలీసు కమిషనర్‌గానూ పనిచేశారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఎంబిబిఎస్ వైద్యుడైన తరుణ్ జోషి నిజాయితీ, సమర్థుడైన అధికారిగా పేరుగాంచారు. కాగా మల్కాగిరి కమిషనర్‌గా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజిగా వున్న బడుగుల సుమతి నియమితులయా ్యరు. గ్రూప్ వన్ అధికారిగా పోలీసు శాఖలో చేరిన సుమతి ఇంతకు ముందు చిక్కడపల్లి ఎసిపిగా పనిచేశారు. 2006లో ఐపిఎస్ హోదా వచ్చాక హైదరాబాద్‌లోని ఉత్తర మండల డిసిపిగానూ, ఉమ్మడి మెదక్ ఎస్పీగానూ మహిళా భద్రతా విభాగం డిఐజిగానూ పనిచేశారు. గడచిన ఏడాదిన్నర కాలంలో ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలంగాణకు చెందిన 250 మందికి పైగా నక్సలైట్లు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం వెనుక సుమతి ఆమె నేతృత ్వంలోని ఎస్ఐబి బృందం విశేష కృషి వుండడం గమనార్హం. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సుమతికి ముక్కుసూటి అధికారిగా సుమతికి పేరుం ది. నిజాయితీ, సమర్థురాలైన అధికారిగా ఆమె పేరు గాంచారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కన గల మూడు పోలీసు కమిష నరేట్లకు ఒక మహిళా అధికారి కమిషనర్‌గా నియమితులవడం ఇదే తొలిసారి.

# కెబిఆర్ చుట్టూ పనులు వేగవంతం

## - రూ. 1,090 కోట్ల మెగా ప్రాజెక్ట్‌తో జూబ్లీహిల్స్ ట్రాఫిక్‌కు చెక్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః
నగర ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ప్రాజెక్ట్ వేగం పుంజుకుంది. కేబీఆర్ ఉద్యానవనం పరిసర ప్రాంతాలు, జూబ్లీహిల్స్, పంజాగుట్ట ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపట్టిన రూ. 1,090 కోట్ల పనులు ప్రస్తుతం దూసుకెళ్తున్నాయి. సిగ్నల్ ఫ్రీ ప్రయాణం లక్ష్యంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, జంక్షన్ అభివృద్ధి పనులు ఒకేసారి కొనసాగుతున్నాయి. ఈ భారీ ప్రణాళికలో భాగంగా మొత్తం 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాసులు నిర్మించనున్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, యూసుఫ్‌గూడ, ఫిల్మ్ నగర్ వంటి కీలక మార్గాలను అనుసంధానం చేస్తూ ట్రాఫిక్‌ను వేగవంతం చేయడంపై దృష్టి పెట్టారు. పీక్ అవర్స్‌లో గంటల తరబడి నిలిచిపోయే వాహన రద్దీని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు. దీనికితోడు ట్రాఫిక్ పోలీసు అధికారులు అభివృద్ధి పనుల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపులకు సంబంధించిన బోర్డులను ఏర్పాటుచేసి వాహనదారులను అప్రమత్తం చేశారు. ట్రాఫిక్ రద్దీని, ఇబ్బందులను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నారు.

**మొదటి దశలో..**

మొదటి దశలో రూ. 580 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా
- జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 నుంచి యూసుఫ్‌గూడ వరకు వై ఆకార గ్రేడ్ సెపరేటర్,
- కేబీఆర్ ఉద్యానవన ప్రధాన ద్వారం నుంచి రోడ్ నంబరు 36 వరకు 4 లేన్ల స్టీల్ ఫ్లైఓవర్
- యూసుఫ్‌గూడ నుంచి రోడ్ నెం.45 వరకు 2 లేన్ ఫ్లైఓవర్.
- పంజాగుట్ట నుంచి క్యాన్సర్ హాస్పిటల్ వరకు అండర్‌పాసులు నిర్మిస్తున్నారు.

**రెండో దశలో..**

రెండో దశలో రూ.510 కోట్లతో ఫిల్మ్ నగర్ జంక్షన్ అభివృద్ధి, మహారాజా అగ్రసేన్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ మెరుగుదల పనులు చేపట్టనున్నారు.

**చెట్ల తొలగింపు.. రీలొకేట్**

ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు 1,500 చెట్లను తొలగించాల్సి వస్తోందని ఇప్పటికే అధికారులు అంచనా వేసి నివేదికలు రూపొందించారు. అయితే పర్యావరణ సమతుల్యత దృష్ట్యా 380 చెట్లను వేర్లు సహా శాస్త్రీయంగా మార్పిడి చేయనున్నారు. అదనంగా శంషాబాద్, షేక్‌పేట రాక్ గార్డెన్ ప్రాంతాల్లో ఈ చెట్లను రీలొకేట్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.



ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై జీహెచ్ఎంసీ అధికారులతో చర్చిస్తున్న ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీలు



కేబీఆర్ చుట్టూ చెట్లను తొలగిస్తున్న సిబ్బంది.

### ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం

ఈ పనులు పూర్తైతే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిధిలో ప్రధాన మార్గాలపై సిగ్నల్ అవసరం లేకుండా వాహనాలు నిరాటంకంగా ప్రయాస్తాయి. బాటిల్ నెక్స్ తగ్గడంతో పాటు రోడ్డు భద్రత మెరుగుపడుతుంది. 2026 నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తి కానుండగా, నగర రవాణా వ్యవస్థలో ఇది కీలక మలుపు తిప్పే ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మెగా ప్రాజెక్టులు భవిష్యత్ నగర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని నిపుణులు అంటున్నారు.

# మాదాపూర్‌లో సిఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

**-వాకర్స్,కాలనీ అసోసియేషన్లలతో మాటమంతి**

**-మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా**



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సృజన తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ జి.సృజన శుక్రవారం మాదాపూర్ సర్కిల్ పరిధిలోని కావూరి హిల్స్, కాకతీయ హిల్స్ ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కూకట్‌పల్లి జెడ్‌సి, మాదాపూర్ డిప్యూటీ కమిషనర్‌లతో కలిసి మౌలిక సదుపాయాలపై కొనసాగుతున్న పనులను ఆమె సమీక్షించారు.అలాగే రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, మార్నింగ్ వాకర్స్, స్థానిక నివాసితులతో మాట్లాడి పౌర సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జరుగుతున్న పనుల పురోగతిని ఇంటింటికీ వెళ్ళి సేకరిస్తున్న చెత్త సేకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. కావూరి హిల్స్ పార్కులోని సౌకర్యాలను యోగా కేంద్రాన్ని పరిశీలించారు. కాకతీయ హిల్స్‌లో ఆర్‌డబ్ల్యూఏలతో కలిసి ర్యాలీలో పాల్గొని, "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమం అమలును పర్యవేక్షించారు. కాకతీయ హిల్స్ పార్క్1 (రోడ్ నెం. 4) ని సందర్శించి, అక్కడ షటిల్ మరియు పికిల్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు ప్రాంతాలలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రోడ్ నెం. 3 వద్ద నీరు నిలిచే ప్రాంతాలను, అలాగే రోడ్ నెం. 4 మరియు 6 జంక్షన్లను పరిశీలించి, నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. రోడ్ నెం. 6 నుండి 11 వరకు పేరుకుపోయిన సిఅండ్‌డి వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే వీధివ్యాపారులకు "నో ట్రేడ్ నో బిన్" (డస్ట్ బిన్ లేకపోతే వ్యాపారం లేదు) విధానం అమలును సమీక్షించారు. రహదారి వెడల్పును తగ్గించి, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు.

# ఎంఎంసీ పరిధిలో ఫ్రైడే..డ్రై డే

**-దోమల నియంత్రణకు చర్యలు**

**-వివిధ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న అధికారులు**



హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :
ఎంఎంసీ పరిధిలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి డెంగ్యూ, మలేరియా వంటి దోమల వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. వార్డుల వారీగా పర్యటించిన సిబ్బంది నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ఫా గింగ్ చేశారు. ప్రజలు ప్రతి శుక్రవారం 10 నిమిషాలు కేటాయించి ఇళ్ల పరిసరా లను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

**క్యూఆర్ కోడ్‌తో ప్రజాభిప్రాయాల సేకరణ:** 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక్తలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా పౌరుల అభిప్రాయాలను సేకరించే కార్యక్రమాన్ని ప్రారం భించారు. ప్రజా మరుగుదొడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు తదితర ప్రాంతాల్లో కోడ్‌లను ఏర్పాటు చేసి, పౌరులు తమ సూచనలు సులభంగా తెలియజేయవచ్చని అధికారులు తెలిపారు.

**మహిళలకు కుట్టు శిక్షణ** - 323 మంది లబ్ధియూసీడీ విభాగం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు 4 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంలు కుట్టే నైపుణ్యాన్ని అందించారు. ఉప్పల్, ఘట్‌కేసర్, నాగోల్ తదితర ప్రాంతాలకు చెందిన మొత్తం 323 మంది మహిళలు శిక్షణ పూర్తి చేశారు. ఈ కార్యక్రమం మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# తన్మయుల్ని చేసిన నవజనార్ధన పారిజాతం నాట్యప్రదర్శన



నవజనార్ధన పారిజాతం ఆంధ్రనృత్యంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :
ప్రముఖ సంస్థ నర్తనశాల ఆధ్వర్యంలో రవీంద్రభారతి కళామందిరంలో సంప్రదాయ ఆంధ్రనాట్య విశిష్టతను చాటిచెప్పేలా సవజనార్ధన పారిజాతం నాట్యప్రదర్శన, నవజనార్ధన పారిజాతం పరిశోదనాత్మక పవిత్ర గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆంధ్రనాట్య పునరుద్ధరణకర్తలు, భరతకళా ప్రపూర్ణ పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణకు వినమ్ర పూర్వక అంకితంగా ఆంధ్రనాట్య అగ్రగణ్యుడు, ప్రసిద్ధ నృత్యగురువు డా. కళాకృష్ణ ప్రత్యక్ష సారధ్యంలో అద్భుతంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐజిపి డా. గజరావు భూపాల్ (ఐపిఎస్ ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్), విశిష్ట అతిథులు పద్మశ్రీ ఉమామహేశ్వరి, విజయరామం, పద్మమోహన్ దెందులూరి, నవత కర్నాటి తదితరులతో కలిసి ప్రముఖ ఆంధ్రనాట్య కళాకారులు, మాతాపుత్రికలు సునీల గొల్లపూడి, సాయినికిత కాటూరిలు సంయుక్తంగా రచించిన నవజనార్ధన పారిజాతం పవిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ పుస్తకం తూర్పుగోదావరి జిల్లాలోని కళావంతుల సంప్రదాయంలో ఆరు శతాబ్దాలుగా విరాజిల్లుతున్న ప్రబంధ నృత్యవిశేషాలను శాస్త్రీయంగా వివరించిందన్నారు. సత్యభామ అహంకారం వీడి దైవంతో పొందే అద్వైత సిద్ధిని, నవజనార్ధన క్షేత్రాల ప్రాముఖ్యతను, దరువులు, సత్యభామ జడ, ముక్కుపుడక వంటి ఆచారాల వెనకున్న ఆధ్యాత్మిక, శాస్త్రీయ అంతరార్థాలను కూలంకషంగా విశ్లేషించారని పేర్కొన్నారు. సునీల, సాయినికితల నవజనార్ధన పారిజాతం నృత్యం కుంభ హారతితో ప్రారంభమై కృష్ణశబ్దం, అష్టదిక్పాలక ఆరాధన, జావళి, వర్ణం, పలు విశిష్ట దరువులతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకుడు గోపాలరావు మృతి



హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త
హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు గోపాలరావు మృతి చెందారు. నగరంలోని కొండాపూర్‌లో ఉన్న ఆయన కుమారుడి నివాసంలో మృతి చెందారు. గోపాలరావు భౌతిక ఖాయాన్ని ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని తన ఇంట్లో మిత్రుల సందర్శనార్థం ఉంచి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సోము గోపాలరావు 1986లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ వ్యవస్థాపకుల్లో ఒకరు. తొలి పుస్తక ప్రదర్శనకు సమన్వయకర్తగా వ్యవహరించారు.సైంటిఫిక్ సర్వీసెస్ అనే సంస్థ ద్వారా వారు పుస్తక రంగానికి సేవలు అందించారు. అనేక పుస్తక ప్రదర్శనల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు గోపాలరావు.గోపాలరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డా.యాకూబ్, ఉపాధ్యక్షుడు మలుపు బాల్‌రెడ్డి, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు,కోశాధికారి నారాయణరెడ్డి. వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

# గోపన్‌పల్లిలో వ్యక్తి అరెస్టు ..

**1.5కిలోల గంజాయి స్వాధీనం**



స్వాధీనం చేసుకున్న గంజాయి



పోలీసులు అరెస్టు చేసిన మధుసూధన్ హవాల్దార్

గచ్చిబౌలి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త
పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి గంజాయిని నగరానికి తరలించి ఎక్కువ ధరకు విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మధుసూధన్ హవాల్దార్(25) నగరానికి వలస వచ్చి గోపన్‌పల్లి ఎన్‌టిఆర్ నగర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న అపర్ణా నిర్మాణ సంస్థలో పనిచేస్తూ అక్కడే ఉన్న లేబర్ క్యాంపులో నివాసం ఉంటున్నాడు. కాగా ఇతను సులభంగా డబ్బ్ సంపాదించడం కోసం గంజాయి విక్రయించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన మణిక్ దాస్ ఠాకూర్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చాడు. గోపన్‌పల్లిలోని అపర్ణా లేబర్ క్యాంపులో గంజాయిని ఉంచి విక్రమించేందుకు ప్రయత్నించాడు. విశ్వసనీయ సమాచా రం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మధుసూధన్ నివాసం మీద దాడి చేశారు.ఈదాడిలో1.5 కిలోల గంజాయితో పాటు వెయిట్ మిషన్, ప్యాకింగ్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడి మీద ఎన్‌డిపిఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## జూబ్లీహిల్స్‌లో బీఎండబ్ల్యు కారు బోల్తా



జూబ్లీహిల్స్, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః
జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఒక కొత్త బెంజి కారు బోల్తా పడింది. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ వైపు నుంచి ఫిల్మ్‌నగర్ వైపు వస్తున్న బీఎండబ్ల్యు కారు వేగంగా వచ్చి ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో వారు కారును వదిలి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కారును తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు. కారుకు ఉన్న టీఆర్ నంబరు ఆదారంగా పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



ఇంద్రానగర్‌లో పవర్ బోర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త :
వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా కూడా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో ఆయన పర్యటించారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకుని ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చడానికి ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న గల్లీలల్లో ట్యాంకర్లు వెళ్లడం కష్టతరమని అందుకే ఇలాంటి బోర్లు ప్రజలకు ఎంతో ఊరటనిస్తాయన్నారు. హైదరాబాద్ నగరం ప్రస్తుం దేశంలోనే అత్యంత వేంగా అభివృద్ధి చెంతున్న మహానగరాలలో ఒకటి అని జనాభా పరంగా మౌలిక వసతుల సదుపాయాలలో అభివృద్ధిపరంగా దేశంలోనే అగ్రసేని 5, 6 నగరాలతో పోటీ పడుతూ హైదరాబాద్ ప్రముఖ స్థానంలో దూసుకుపోతుందన్నారు. నగర విస్తరణకు అనుగుణంగా ప్రభుత్వం వేసవి కార్యాచరణ ప్రణాళికను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వర్షపు నీటి కాలువలు, పైప్‌లైన్లలో కూరుకుపోయిన మట్టి వ్యర్థాలను సత్వరమే తొలగించి నీటి ప్రవాహానికి ఆటకం లేకుండా చూడాలన్నారు. నగరంలో ఎక్కడా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రస్తుతం జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అనేక బస్తీలలో నీటి అవసరాల నిమిత్తం కొత్తగా పవర్ బోర్స్‌ను ప్రారంభించటం జరిగిందన్నారు. ఇప్పటికే అనేక బస్తీలలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని రెండు రోజులకు ఒక్కసారి కూడా కనీసం గంటసేపైనా సరైన రీతిలో త్రాగు నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేవలం తాగు నీటికే కాకుండా ప్రజల దైనందిన అవసరాలకు సరిపడా నీటి సరఫరా చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి జలాల మళ్లింపు, మల్లన్న సాగర్ నుంచి రావాల్సిన పైప్‌లైన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నగరవాసులందరికి శాశ్వత నీటి వసతిని కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్‌లో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కొలన్ సత్యానారయణ తల్లి దివంగత లక్ష్మమ్మ మరణం పట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వారిని నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, ప్రేమ్ కుమార్, కుంభాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్‌కు విస్తృత చర్యలు

**-జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ చంద్రకళ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్షన్స్ అదనపు కమిషనర్ చంద్రకళ, అబ్దుల్ వకీల్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:
ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం(ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల జాబితా నవీకరణ కోసం విస్తృత చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జిహెచ్ఎంసి ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ (ఎలక్షన్స్) కె. చంద్రకళ, సీవీఓ అబ్దుల్ వకీల్ హైదరాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆర్‌డబ్ల్యూఏ, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని స్టేక్‌హోల్డర్ల వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఓటర్ల మ్యాపింగ్‌పై అవగాహన కల్పించామని తెలిపారు. ఈ సమావేశంలో సుమారు 200 మంది పాల్గొని, సంబంధిత బిఎల్‌వోల ద్వారా మ్యాపింగ్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే జిహెచ్ఎంసి ఉద్యోగుల సంఘంతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి కుటుంబ సభ్యులతో కలిపి ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. అలాగే కెబిఆర్ పార్క్ వద్ద వాకర్స్ కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి మ్యాపింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని పెంపొందించి, ప్రజలకు మెరుగైన ఎన్నికల సేవలు అందించడమే లక్ష్యం అని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అడ్మిన్ అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం నందినగర్ వాసుల ఆందోళన



జలమండలి కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్న నందినగర్ వాసులు.

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః** గత రెండు రోజులుగా తాగునీరు రావడం లేదని ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వరకాలనీ డివిజన్ నందినగర్ వాసులు తట్టిఖానా జలమండలి కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గత రెండు రోజులుగా నీరు రాకపోవడంతో స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో స్థానికులంతా కలిసి జలమండలి కార్యాలయానికి చేరుకొని అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. నీళ్లు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళనకు మద్దతు పలికారు. అక్కడి నుంచి జలమండలి ఈడీ అశోక్ స్వామాట్, సీజీఎం ప్రభుతో మాట్లాడారు. ఈ క్రమంలోనే అధికారులు నందినగర్‌కు 20 వాటర్ ట్యాంకర్లను పంపించారు. స్థానికులకు నీటిని అందించాలని సూచించారు. మరోవైపు విషయం తెలుసుకున్న వెంకటేశ్వరకాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు చౌహాన్ జలమండలి సీజీఎంతో మాట్లాడారు. నీరు రాకపోవడానికి గల కారణాలపై దృష్టి పెట్టారు. కొన్ని ప్రాంతాల్లో వాల్వ్‌లలో సమస్యలున్నట్లు గుర్తించారు. పంపింగ్ ప్రక్రియకు అడ్డుగా ఉన్నవాటిని పరిష్కరించి నీటిని సరఫరా చేస్తామని హామినిచ్చారు. సీజీఎం ప్రభు ప్రత్యక్షంగా నందినగర్ ప్రాంతంలో మన్నె గోవర్ధన్‌రెడ్డి, రాములుచౌహాన్‌లతో కలిసి పర్యటించి నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన పనులను ప్రారంభించారు.

## విశ్వబ్రాహ్మణ కులాన్ని యధాతధంగా బిసి జాబితాలోనే ఉంచాలి


గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బిసి కులాల జాబితాలో గ్రూప్-బిలో 21లో చేర్చబడిన విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) అనే కులం పేరును ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యంగా తీసివేయడం దారుణమని ఇండియన్ విశ్వకర్మ ఆఫీసర్, బిసినెస్మేన్ అండ్ ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బిఎన్‌వి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ తదితర అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. 2024లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో వచ్చిన రిపోర్ట్‌ను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ తప్పును ప్రభుత్వం సరిచేయకపోవడం అన్యాయమన్నారు. బిసి జాబితాలో ఉన్న విశ్వబ్రాహ్మణ కులంపేరును యధాతథంగా పునరుద్ధరించాలని ఆయన కోరారు.

## ఆర్టీసి కార్మికులు ఆత్మహత్య చేసుకోవద్దు

-బిఆర్‌ఎస్, బిజెపిలు సర్కార్‌ను విమర్శించే హక్కు లేదు

-టిపిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

ఆర్టీసీ కార్మికులు ఎవ్వరు ఆత్మహత్యలు చేసుకోవద్దని టిపిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ విజ్ఞప్తి చేశారు.వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నారని, తొందరపాటు నిర్ణయంతో ప్రాణం పోతే తిరిగి రాదని కార్మికులు ఎవరు ఆత్మహత్యలకు పాల్పడకూడదని కోరారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 42 రోజుల సమ్మెలో 21 మంది కార్మికులు మృతి చెందారని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని, రాజకీయ లబ్ధి కోసం శవాలతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.శాంతియుతంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని యాదగిరిగౌడ్ సూచించారు.

### ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 5కోట్ల నష్టపరిహారం చెల్లించాలి : పవన్‌కుమార్ గౌడ్


డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి నిరసనగా నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న గుర్రం పవన్‌కుమార్ గౌడ్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఆర్టీసీ డ్రైవర్‌శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే 5 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జోనల్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నిన్న రాత్రి మరణించిన డ్రైవర్ శంకర్ గౌడ్‌కు హైదరాబాద్ 2 డిపోలో శుక్రవారం జరిగిన శ్రద్ధంజలి సభలో అయన ప్రశంగించారు. ఇది కేవలం ప్రభుత్వ హత్యగా అయన అభివర్ణించారు. 45 రోజుల క్రితం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వనికి నోటీసు ఇచ్చినా, ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే కార్మికులు తప్పని పరిస్థితిలో సమ్మెకు వెళ్లారని అయన వివరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలకు ప్రభుత్వం సాకాలంలో స్పందించి ఉంటే ఈ రోజు మనం శంకర్ గౌడ్‌ను కోల్పోయేవారం కాదని పవన్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు శంకర్ గౌడ్ చిత్రపటంతో దిల్‌సుఖ్‌నగర్ ప్రాతంలో శాంతి ర్యాలీ నిర్వహించాం. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్, హైదరాబాద్2 డిపో జేఏసీ నాయకులు లిప్ రెడ్డి, అంజన్న, శ్రీనాద, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గోవుల రక్షణకై ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

సంతకాల సేకరణ కార్యక్రమంలో పలువురు న్యాయవాదుల విజ్ఞప్తి


సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

**ముషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గోవధ నుంచి గోవులకు రక్షణ కల్పించటానికి, గోవుల సంక్షేమానికై ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని పలువురు తెలంగాణ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో సనాతన, హిందూ కార్యకర్త న్యాయవాదులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పి.ప్రదీప్‌కుమార్, రవీందర్, దేవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని న్యాయవాదుల నుంచి, క్లైంట్స్ నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో ఆరాధన, గో ప్రచార ఉద్యమంలో భాగంగా గోరక్షణకై సంతకాల సేకరణ నిర్వహించి, వినతి పత్రాలను మన రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, అన్ని రాష్ట్రాల గవర్నర్లకు, ముఖ్యమంత్రులకు పంపుతున్నామని వివరించారు.

### వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు : అరవింద్‌కుమార్ యాదవ్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, దేవీ వరప్రసాద్

**ముషీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ బాకా రంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దేవీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించా రు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ..సీ ఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క కార్యకర్త సేవాభావా న్ని అలవర్చుకుని, పేదలకు అండగా నిలవాలని సూచించారు. దేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేయటం అభి నందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు జఫీర్ ఉద్దీన్, యూత్ నాయకులు సంగపాక వెంకట్, ఐఎన్‌టియూసీ ఉపాధ్యక్షులు నల్లవెల్లి అంజిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గుర్రం శంకర్, శ్రీశైలం యాదవ్, అల్లా ఉద్దీన్, వినోద్ పాల్గొన్నారు.

### సాహిత్య, కళారంగాలు విజ్ఞాన భాండాగారాలు : ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


పురస్కారాలను ప్రధానం చేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, గాయని ఆమనీ తదితరులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 24 ( ప్రభాతవార్త ) :** సాహిత్య, కళారంగాలు ప్రజలకు కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని కూడా అందించే గొప్ప మాధ్యమాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, ఆర్.ఆర్. ఫౌండేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో యువ కళావాహిని వ్యవస్థాపకులు వై.కె. నాగేశ్వరరావు, ప్రముఖ గాయకుడు కె. వెంకటరావుల సంస్మరణార్థం వారి పేరిట స్మారక పురస్కారాలను ప్రధానోత్సవ సభ నిర్వాహక సంస్థ చైర్మన్ భీం రెడ్డి, స్థాపక కార్యదర్శి, ప్రముఖ గాయని ఆమనీ నిర్వహణలో కళా పత్రిక సంపాదకులు రఫీ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ సమాజం కోసం అద్భుతమైన కృషి చేసిన కళాకారులను విస్మరించడం బాధాకరమన్నారు. అలాగే కె. వెంకటరావు మధుర గళం ఎప్పటికీ మరపురానిదని గుర్తు చేసుకున్నారు.వై.కె. నాగేశ్వరరావు స్నేహమిత్ర పురస్కారంను బొప్పన నరసింహారావు, స్ఫూర్తి పురస్కారం ను నాట్య గురువు నిర్మలా ప్రభాకర్, వెంకటరావు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ గాయకుడు శరత్ బాబు, స్వర రత్న పురస్కారం ను శ్యామలకు అందించగా సామాజిక వేత్త జయా రెడ్డిలను కూడా సత్కరించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ మరణించిన మహనీయులను స్మరించుకోవడం ఉత్తమ సంస్కారమని పేర్కొన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పురస్కార గ్రహీతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ గాయకులు ఆమని, సుభాష్, కృష్ణప్రసాద్, శ్రీదేవి, శోభ తదితరులు ఆలపించిన మధుర గీతాలు శ్రోతలను అలరించాయి.

## హిందూ సమ్మేళనం నిర్వహణకు రూ.2,11,000 వితరణ


బండ్లగూడ జాగీర్‌లో నిర్వహిస్తున్న "హిందూ సమ్మేళనం" నిర్వాహకులకు రూ.2.లక్షల 11.వేలు ఇస్తున్న నీరుడి శేఖర్ ముదిరాజ్.

**నార్సింగి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** హైందవులలో ఐక్యతను పెంచుతూ, హిందూ ధర్మ పరిరక్షణను ఆకాంక్షిస్తూ ఈ నెల 26.వ,తేదీన బండ్లగూడ జాగీర్ డివిజన్‌లో నిర్వహిస్తున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమ నిర్వాహకులకు శుక్రవారం బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు నీరుడి శేఖర్ ముదిరాజ్ రూ.2,11,000లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఏర్పడినప్పటి నుంచే సనాతన(హిందూ) ధర్మం ఏర్పడిందని, దీన్ని నాశనం చేయాలని వేలాది సంవత్సరాలుగా అనేక మంది ఎన్ని కుట్రలు చేసినా తట్టుకొని తలెత్తుకొని నిలబడిందన్నారు. సనాతనం అంటేనే నిత్య నూతనం అని వివరించారు. ప్రపంచంలోని ఇతర దేశాల ప్రజలు బట్టలు కట్టకోలేని సమయంలోనే భారతదేశంలోని రాజులు, ప్రజలు వజ్ర,వైడుర్యాలు, మణులు, మాణిక్యాలు పొదగబడిన కిరీటాలు, ఆభరణాలు ధరించారని వివరించారు. కోట్ల సంవత్సరాల ముందే మనదేశంలో పుష్పక విమానాలు తయారు చేసి ప్రయాణించారని, టెస్ట్‌ట్యూబ్ బేబీ(అశ్వద్ధామ,కౌరవులు)లను సృష్టించారని, కంటి శస్త్రచికిత్సలు చేశారని గుర్తు చేశారు. స్వయంగా భగవంతుడే భరతగడ్డపై అవతరాలు ధరించి పావనం చేశారని, ఈ పుణ్యగడ్డను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. మనబలం ముందు నిలబడలేమని గ్రహించిన శత్రువులు మన రాజుల మధ్య అనైక్యతను ఆసరాగా చేసుకొని మనపై దండెత్తి, మన సంపదను కొల్లగొట్టుకుపోయారని, ఇందుకు మన రాజుల సహకారమే కారణమైందన్నారు. కోట్ల సంవత్సరాల నుంచి మనదేశంలో క్షత్రీయులు, బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలు మాత్రమే ఉన్నాయని, శత్రువులు మనలను అనేక కులాల వారీగా విభజించారని గుర్తు చేశారు. మళ్లీ మనమంతా మొద్దు నిద్రను వీడి, జాగరూకులమయ్యి కులాలను పక్కన పెట్టి అందరం ఒకేజాతి బిడ్డలమని, ఐక్యంగా ఉండి "విశ్వగురు" స్థానంకు చేరుకుందామని నీరుడి శేఖర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం ప్రతినిధులు, స్థానిక హైందవ సోదరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

-రూ.1.84లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

**అత్తాపూర్ ఏప్రిల్ 24,ప్రభాతవార్త :**



ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారాన్నందించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం అత్తాపూర్ సర్కిల్ కాటేదాన్ ,మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని దుర్గా వెంచర్ ప్రాంతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో రూ. 1.84 కోట్లతో చేపట్టే మంచినీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కోటి 84 లక్షలు అంచనా వ్యయంతో పనులు చేపట్టడం జరుగుతుందని అయ్యప్ప టెంపుల్ సమీపంలోని వివిధ గృహ సముదాయాలకు ప్రయోజనం చేకూర్చేలా 200ఎంఎం, 150ఎంఎ మరియు 100ఎంఎ డయా కలిగిన వాటర్ సప్లై లైన్లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన మంచినీటిని అందించడమే మా లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ పైప్‌లైన్ పనులు పూర్తయితే కాటేదాన్ మరియు మైలార్ దేవ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నీటి ఎద్దడి శాశ్వతంగా తొలగిపోతుందన్నారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జలమండలి అధికారులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్మబద్ధ జీవనమే మానవ ధర్మం : విశ్రాంత డిజిపి గోపినాథ్ రెడ్డి

**చిక్కడపల్లి ఏప్రిల్ 24 ( ప్రభాతవార్త ) :**


ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్ ను సత్కరిస్తున్న విశ్రాంత డీజీపీ గోపినాథ్ రెడ్డి, చిత్రంలో ప్రముఖ వేదపండితులు వీణాపాణి శాస్త్రి కూడా ఉన్నారు.

ధర్మబద్ధమైన జీవనమే అసలైన మానవ ధర్మమని, ధర్మాన్ని విస్మరించిన వారు మానవత్వాన్ని కోల్పోతారని విశ్రాంత దీబిశి డాక్టర్ సి.ఎన్. గోపినాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ వేద పండితులు వీణాపాణిశాస్త్రి ఆధ్వర్యంలో "గురుత్రయం" శీర్షికన శంకరాచార్య, త్యాగరాజ స్వామి, రామానుజాచార్యుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. త్యాగరాజ స్వామి కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి మార్గదర్శి కాగా, శంకరాచార్య, రామానుజాచార్యులు ఆధ్యాత్మిక పథానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్ మాట్లాడుతూ.. భారతీయ ఆధ్యాత్మిక సంపద ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైనదని పేర్కొన్నారు. సర్వ మానవులను, ప్రతి జీవిని ప్రేమించాలని వేద శాస్త్రం బోధిస్తున్నాయని వివరించారు. సభా కార్యక్రమం అనంతరం ప్రముఖ నాట్య గురువు తులసి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. వీణాపాణి శాస్త్రి కార్యక్రమ విశిష్టతను వివరించగా, వేదికపై గాయని రాగరంజని తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎన్‌బి సైన్సుకళాశాల వ్యవస్థాపక దినోత్సవం

**చార్మినార్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** పాతబస్తీ చార్‌కమాన్‌లోని నానక్‌రామ్ భగవాన్ దాస్ సైన్సు కళాశాల,ఎస్. డి.సిగ్నోడియా ఆర్ట్,కామర్స్ కళాశాలల ఇరవై ఐదు సంవత్సరాల వార్షికోత్సవాన్ని (సిల్వర్ సినర్జీ) ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నామని ఎస్‌డిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.సిహెచ్.దాల్ పదాల్ తెలిపారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని,అగ్రసేన్ చారిటిబుల్ ట్రస్ట్ చైర్మన్ గోపాల్ చంద్ అగర్వాల్ అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షులు ప్రమోద్‌కుమార్ కేడియో పాల్గొంటున్నారని తెలియజేశారు.

### నేడు పలు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజాంపేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** చెట్ల కొట్టివేత, నిర్వహణ పనుల నేపథ్యంలో నేడు బచ్చుపల్లి పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిజాంపేట్, ఎస్ఎంఎస్, మా విల్లాస్, ఎస్ఎల్‌జీ, వెంకట్ ప్రణీత్, తరుణ్ భాస్వాని, హిల్ కౌంటీ రోడ్, కాకతీయ నగర్, ఇందిరా నగర్, బచ్చుపల్లి గ్రామం, ఎస్సీ కాలనీ, సీతారామ హోమ్స్, మా విల్లాస్, బొల్లారం పరిశ్రమల ప్రాంతం, ప్రణీత్ అంటిల్లా రోడ్, కౌసల్య కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రజలు సహకరించాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని బచ్చుపల్లి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. శశిధర్ కోరారు.

### అనారోగ్యంతో బాధపడుతూ కార్మికుడు మృతి

**మైలార్‌దేవ్‌పల్లి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతూ ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం....వినాయక్‌నగర్‌కు చెందిన ఎ.రాజు (56) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు.రాజు వాటర్ వర్క్స్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. రాజు భార్య,చిన్న కూతురు కొంత కాలం క్రితం మరణించారు. గత అరు నెలలు నుంచి రాజు పనికి వెళ్లటంలేదు.జీవితంపై విరక్తి చెందటంతో పాటు ఆనారోగ్యం వల్ల రాజు ఇంటి వద్దనే ఉంటున్నాడు.మందులు వాడుతున్నప్పటికి ఆరోగ్యం కుదుట పడటం లేదు.ఇంటిలోనే రాజు శుక్రవారం మృతి చెందాడు.పోలీసులు రాజు మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళలు స్వయం సంవృద్ధి సాధించాలనేదే తన కోరిక : ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ


లబ్ధిదారురాలుకు కల్యాణలక్ష్మీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మహిళలు స్వయం సంవృద్ధిని సాధించాలనదే తన కోరికని, వారి అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని చాంద్రాయణ గుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ తెలిపారు. శుక్రవారం బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ పేద ప్రజల వివాహాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. మజ్లీస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తారన్నారు. మధ్య తరగతి నిరుపేద మహిళలు, వితంతువుల కోసం స్వయం ఉపాధి పథకాల ద్వారా కుట్టు మిషిన్లు, బ్యూటీ పార్లర్ ట్రైనింగ్, కిట్లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.12.33 కోట్ల విలువ చేసే 1232 (168 కల్యాణలక్ష్మి, 1064 షాదీముబారక్ ) చెక్కులను పంపిణీ చేసినట్లు బండ్లగూడ తహశీల్దార్ కె.ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ సిబ్బంది, నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కోకరివాడిలో కిందికి వేలాడుతున్న విద్యుత్ సర్వీస్ వైర్లు



**చార్మినార్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని కోకరివాడి బస్తీలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడు తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. కోకరివాడిలో రహదారులు వెడల్పు తక్కువదీనికి తోడు విద్యుత్ సర్వీస్ వైర్లు చాలా కిందికి ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలుభయ పడుతున్నారు.రాత్రి వేళల్లో కోకరివాడిలో చీకటి ఉండటంతో వాహనదారులు తమ వాహనాలను నడుపుతున్న సమయంలో నానా అవస్థలు పడుతున్నారు.ఈ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు పలు మార్లు వినతి చేసిన పట్టించుకోవటం లేదు.కోకరివాడిలోని ఇండ్లలో బంగారు ఆభరణాలు తయారు చేసి షాపులకు సరఫరా చేస్తుంటారు.ఘాన్సీ బజార్ డివిజన్ ప్రజలు ప్రతీ నెల విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్న అధికారులు మాత్రం విద్యుత్ వైర్లను ఎత్తులో ఉంచటం లేదని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సర్వీసు వైర్లు చాలా కిందికి వేలాడుతుండటంతో పెద్ద వాహనాలు రావటానికి ఇబ్బందిగా ఉంది.వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ సర్వీస్ వైర్లు ఊగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోకరివాడి బస్తీలో విద్యుత్ స్తంభానికి కిందికి వేలాడుతున్న సర్వీసు వైర్లను ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### తెలుగు సాహిత్య వికాసానికి ఒద్దిరాజు సోదరుల కృషి అనన్యం : ఆచార్య కొలకలూరి ఇనాక్



ప్రసంగిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 24 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ ప్రాంతంలో తెలుగు సాహిత్య అభివృద్ధికి, భాషా వికాసానికి ఒద్దిరాజు సోదరులైన సీతారామచంద్రరావు, రాఘవరంగారావు చేసిన కృషి మరువలేనిదని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. శుక్రవారం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహించిన ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా, గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికపై ఒద్దిరాజు సోదరుల యాదిలో ప్రత్యేక కార్యక్రమం అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ తెలంగాణలో తొలి పత్రిక తెలుగును ప్రారంభించి, తెలుగు భాషను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన ఘనత ఒద్దిరాజు సోదరులకే దక్కుతుందని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య సంపదను పెంపొందించడంలో తెలంగాణ ప్రాంత సాహితీవేత్తల పాత్ర విస్మరించలేనిదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వాహిని ఇన్స్టిట్యూట్ నిర్వాహకురాలు లక్ష్మీప్రియ, గాయకుడు త్రినాథరావు, గానసభ సభ్యులు శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ఒద్దిరాజు సోదరుల సాహిత్య సేవలను స్మరించుకున్నారు.

### ప్రయాణికులు,ఆర్‌టిసి కార్మికులకు భోజనం


ఎం.జి.బి.ఎస్‌లో ప్రయాణికులకు భోజనం అందచేస్తున్న నిర్వాహకులు వి.కిషన్‌యాదవ్

**గోషామహల్,ఏప్రిల్ 24ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆర్టీసి కార్మికుల సమ్మె నేపథ్యంలో,సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన,ప్రయాణికులు,అక్కడే ఉంటున్న కార్మికులకు ఆర్టిసి డ్రైవర్లు,కండక్టర్లకు నందిని గ్రూపు ఆఫ్ హోటల్ యాజమానులు ఎం.రాఘవేందర్,వి.కిషన్‌యాదవ్‌లు ఆద్వర్యంలో ఉచిత భోజనం పంపిణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మూడవ రోజు ఆర్టీసి సమ్మె కొనసాగించిన నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణికులకు,ఆర్టీసి బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు మానవ దృక్పథంతో ఉచిత భోజన పంపిణి కార్యక్రమాన్ని చేపట్టామని వారు తెలిపారు.సమ్మె కొనసాగిన రోజులు ఉచితంగా ఆర్‌టిసి కండక్టర్లకు,డ్రైవర్లకు భోజన పంపిణి కొనసాగుతుందన్నారు.సమ్మె కొనసాగుతుండడంతో, సుదూర ప్రాంతాలకు,స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు, ఇక్కడే ఉండి సమ్మెలో పాల్గొనే ఆర్‌టిసి కార్మికులకు,పోర్టల్ సిబ్బందికితోపాటువిధి నిర్వహణలో ఉన్న పోలీసుల సిబ్బందికి ఈ భోజనాన్ని అందచేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో వి.సాయిరాయాదవ్,రాఘవేందర్,నందిని గ్రూపు ఆఫ్‌హోటల్స్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సుబాన్‌పురాలో మంచినీటి సమస్య పరిష్కరించాలి


రెడ్‌హిల్స్‌లో జలమండలి కార్యాలయం ముందు బస్తీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న మునకుంట్ల

**బేగంబజార్,ఏప్రిల్ 24ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ పరిధిలోని సుబాన్‌పురాలో మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ నేత మునుకుంట్లఆనంద్‌కుమార్‌గౌడ్ జల మండలి అధికారులను కోరారు.గత ఎనిమిది నెలలుగా సుబాన్‌పురాలోబోర్ పాడై పోయి పని చేయడం లేదని, మరమ్మత్తులు చేయించాలని పలు మార్లు సుబాన్‌పురాబస్తీ వాసులు జలమండలి అధికారులకు విన్నవించినప్పటికిఇ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.శుక్రవారం రెడ్‌హిల్స్ డివిజన్-4 జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.బస్తీ వాసుల వినతి మేరకు గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ నేత మునుకుంట్లఆనంద్‌కుమార్‌గౌడ్ బస్తీవాసులతో కలిసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.కార్యక్రమంలో బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

**జీడిమెట్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు ఏప్రిల్ 22, 23 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ రెండు రోజుల వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ సంబరాల్లో టీవీఆర్ మోడల్ హై స్కూల్ (అపురూప కాలనీ), సత్యవాణి విద్యా నికేతన్ (ఎస్.ఆర్. నాయక్ నగర్), బచ్‌పన్ ప్లే స్కూల్ (సూరారం), బచ్‌పన్ ఒలింపియాడ్ (చింతల్), టీవీఆర్ గీతాంజలి (పద్మారావు నగర్ చింతల్), బచ్‌పన్ ఒలింపియాడ్ (రంగారెడ్డి నగర్)లకు చెందిన విద్యార్థులు పాల్గొని అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జి. సురేష్ రెడ్డి హాజరయ్యారు. అలాగే ట్రాస్మా అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, ప్రముఖ గాయకుడు, రచయిత దరువు అంజన్న కూడా పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టీవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ టి. కోటి రెడ్డి పర్యవేక్షణలో ఈ వేడుకలు క్రమశిక్షణతో, గ్రాండ్‌గా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, జానపద గీతాలు, సామాజిక అంశాలపై నాటికలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో టీవీఆర్ విద్యాసంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. చైర్మన్ టి. కోటి రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు కళల పట్ల ఆసక్తి పెంపొందించడం తమ సంస్థ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**బేగంపేట ఏప్రిల్ 24,ప్రభాతవార్త**

తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌కు చెందిన కె.రాజు ఆయన సతీమణి ఇద్దరూ ప్రయివేటు ఉద్యోగులు.గురువారం ఉదయం గం 11లకు ఇంటికి తాళం వేసి ఉద్యోగాలకు వెళ్లిపోయారు.సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉంది.ఇంట్లోకి చొరబడిన దొంగలు సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు గుర్తించిన బాధితులు ఈ సంఘటనను బేగంపేట పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేసారు.వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అరెస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను హైదరాబాద్ సిటీ క్రైమ్ స్టేషన్, స్పెషల్ క్రైమ్ టీమ్,గాంధీనగర్ పోలీసులు సంయుక్తంగా కలిసి పట్టుకున్నారు. నిందితుల నుంచి 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఈనెల 23న అత్తాపూర్ సమీపంలోని ఎం.ఎం.పహడీ వద్ద పోలీసులు నిఘా ఉంచి ఈ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వివరాలు: మొహమ్మద్ రియాజ్ (18, నిరుద్యోగి, అత్తాపూర్,ఎం.ఎం. పహడీ నివాసి. రెండవ వ్యక్తి సయ్యద్ అహ్మద్ అలీ (18).ఇతను సోఫా తయారీ గోడౌన్ కార్మికుడు, అత్తాపూర్‌లోని ఎం.ఎం. పహడీ నివాసి. మూడవ వ్యక్తి మొహమ్మద్ ఫర్దీన్ (18) వంట మాస్టర్ (కుక్) ఎం.ఎం. పహడీ నివాసి. ఈ నిందితుల వద్ద నుండి మొత్తం 10 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో హోండా డియో వాహనాలు 8, హీరో గ్లామర్ ఒకటి, బజాజ్ పల్సర్ ఎన్ఎస్200 ఒకటి ఉన్నాయి.ఈ నిందితులు ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా తమ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు క్రైమ్ టీమ్ గుర్తించింది. నిందితుల పోస్టులు మరియు కదలికలపై నిరంతర నిఘా ఉంచిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో వారిని అత్తాపూర్ ప్రాంతంలో పట్టుకున్నారు. విచారణలో వీరు బాలానగర్, గాంధీ నగర్, కొల్లూరు,అత్తాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. డిసిపి (క్రైమ్స్) ఎస్. చైతన్య కుమార్ మార్గదర్శకత్వంలో, ఏసీపీ జి. వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ సిహెచ్.సుధాకర్‌రావు బృందం ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.

### ఆటోలో మర్చిపోయిన బంగారం, నగదు పోలీసులకు అప్పగింత



బంగారం, నగదును పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్ నగేష్‌ను అభినందిస్తున్న సీఐ సీతయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన సుజాత ఆర్.హిరేమత్ (43) గురువారం సాయంత్రం సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము నార్సింగి నుండి బిర్లా మందిర్ వరకు ఉబెర్ ఆటో (టీజీ 11 టి 1076)లో ప్రయాణించామని, దిగిపోయిన తర్వాత తమ బ్యాగ్ ఆటోలోనే మర్చిపోయినట్లు ఆమె తెలిపారు. ఆ బ్యాగులో 6.5 తులాల బంగారు ఆభరణాలు,రూ.3,500లు నగదు ఉన్నాయి. సైఫాబాద్ ఎస్‌హెచ్‌ఓ ఎ.సీతయ్య ఆదేశాల మేరకు, కానిస్టేబుళ్లు కె.వినయ్‌కుమార్ ,మదన్ మోహన్ తక్షణమే రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. కేవలం గంట వ్యవధిలో సదరు ఆటోను,డ్రైవర్ ఫోన్ నంబర్‌ను గుర్తించారు. ఖైరతాబాద్, చింతల్ బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ కె.నగేష్ ఫోన్‌కాల్‌కు స్పందిస్తూ.. బ్యాగ్ తన ఆటోలోనే సురక్షితంగా ఉందని తెలిపారు. వెంటనే ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బంగారం, నగదును పోలీసులకు అప్పగించారు. అనంతరం సదరు ఆస్తిని ఫిర్యాదుదారుకు అందజేశారు. ఆటో డ్రైవర్ కె.నగేష్ ప్రదర్శించిన నిజాయితీని ఎస్‌హెచ్‌ఓ ఎ.సీతయ్య అభినందిస్తూ, ఆయనకు నగదు పురస్కారాన్ని అందజేశారు.



బేగంపేట్‌లో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## గాయిత్రినగర్ కాలనీకి అప్రోచ్ రోడ్డును నిర్మించాలి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన గాయిత్రినగర్ సంక్షేమ సంఘం సభ్యులు.

**యూసుఫ్‌గూడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గాయిత్రినగర్ కాలనీకి అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సున్నం చెరువుని ఆనుకుని ఉన్న స్థలంలో గయిత్రినగర్ నుంచి వంద ఫీట్ల రోడ్డు దాకా కొత్తగా రోడ్డు నిర్మించాలంటూ గతంలో కూడా ప్రతిపాదించినట్లు గాయిత్రినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.కృష్ణారావు తెలిపారు. ఈ విషయమై గతంలో ఇచ్చిన హామీలు గుర్తుందని రోడ్డును ఖచ్చితంగా ఏర్పాటు చేస్తామని కమిషనర్ రంగనాథ్ చెప్పినట్లు వారు తెలిపారు. అందుకు కాలనీ తరపున కృతజ్ఞతలు తెలుపుతూ శాలువతో సత్కరించి పూలబొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు సూరిబాబు, ఉపాధ్యక్షులు కాశినాథ్ చారి, మాజీ ప్రధాన కార్యదర్శి రమణాచారి, కాలనీ మాజీ అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పవర్ బోరును వినియోగంలోకి తీసుకువస్తాం

**-మహంకాళి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి నెమలి**



ఓల్డ్‌పాటిగడ్డలో పవర్ బోర్‌ను పరిశీలించి అధికారులకు సమాచారం ఇస్తున్న నెమలి ఆనంద్,

**బేగంపేట ఏప్రిల్ 24,ప్రభాతవార్త**

రెండు రోజుల్లో ఓల్డ్ పాటిగడ్డలో పాడైపోయిన పవర్ బోరు ను వినియోగంలోకి తీసుకు వస్తామని మహంకాళీ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ తెలియజేసారు. గతంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి బేగంపేట ఓల్డ్‌పాటిగడ్డలో వేయించిన పవర్ బోర్ మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీ వాసులకు నీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెల్సుకున్న ఆనంద్ ఓల్డ్‌పాటిగడ్డకు వెళ్లి మరమ్మతులకు గురైన బోర్‌ను పరిశీలించారు. అనంతరం డిజీఎమ్ రాజగోపాల్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన డీజీఎమ్. వెంటనే సిబ్బందిని ఓల్డ్‌పాటిగడ్డకు పంపి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నెమలి ఆనంద్ మాట్లాడుతూ రెండు రోజుల్లో ఓల్డ్‌పాటిగడ్డలో మరమ్మతులకు గురైన పవర్ బోర్‌ను వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నందూ వెంట బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సీ.విజయ్‌కుమార్, సీనియర్ నాయకుడు మైసూర్ మథుసూథన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తారకం పేట్ శ్రవణ్ కుమార్, డివిజన్ కార్యదర్శి రేణక, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు చేపడితేనే సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట ఏప్రిల్ 24,ప్రభాతవార్త**

అభివృద్ధి పనులు చేపడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్‌పేట డివిజన్ కుర్మబస్తీలో రూ25లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న విడిసిసి రోడ్డు, డి.వి.కాలనీలో రూ27.50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ లైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. పనులు పూర్తయ్యే వరకు స్థానిక ప్రజలు అధికారులకు సహకరిస్తూ సంక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ నాయకుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** సనత్‌నగర్ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టి కాలనీకి చెందిన లాలూ, ఉమేష్‌లు ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన, శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి పార్థివ దేహాలపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, సమీయుల్లా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### చేనేత కళలకు ప్రత్యేక స్థానం : పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి.

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతిలో చేనేత కళలకు ప్రత్యేక స్థానం ఉందని పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో నేషనల్ ఎక్స్‌పో ప్రదర్శనను ఆమె గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు మరింత ప్రోత్సహాన్ని అందించేందుకు వారి ఉత్పత్తులను నేరుగా విక్రయించుకొనే అవకాశం కల్పించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. చేనేతకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని తద్వారా చేనేత కార్మికులకు మనం చేయూతనివ్వ వచ్చన్నారు. ఈ నెల 28 వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో దాదాపు 80 స్టాల్స్‌ను ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.

### సైంటిస్ట్ వెంకటేశ్వర్లుకు 'టైమ్ టూ లీప్ నేషనల్ ఎక్సలేన్స్ అవార్డు'

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**



వెంకటేశ్వర్లును సత్కరించిన లయన్స్ క్లబ్ ఆఫ్ అపూర్వ అధ్యక్షుడు సూర్యనారాయణ

హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ వ్యవసాయ సైంటిస్ట్, స్వామినాథన్ శిష్యుడు, సన్ క్రాఫ్స్ సంస్థ వ్యవస్థాపకుడు, 'రైతున్నలు, వ్యవసాయ విద్యార్థుల కోసం క్రాప్ట మ్యానువెల్-2024' అనే పుస్తకాల రచయిత డా.ఎస్.వెంకటేశ్వర్లుకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 5వ ఎడిషన్లో 'టైమ్ టు లీప్ నేషనల్ ఎక్సలేన్స్ అవార్డు' దక్కించుకున్నారు. ఈ మేరకు ఈ అవార్డును ఢిల్లీలో ఎంఎస్ఎంఇ డైరెక్టర్ శోభ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో వ్యవసాయ రంగంలో అందించిన సేవలకు 'కర్షక సేవా రత్న' అవార్డుతోపాటు మరో 15కు పైగా అవార్డులు లభించాయన్నారు. తాను పంటలపై వచ్చే సమస్యలు-పరిష్కారాలు అనే అంశంపై తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో వేలాది పుస్తకాలను ముద్రించి రైతులకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నానని ఆయన చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ అపూర్వ అధ్యక్షుడు డా.ఇ.ఎస్.సూర్యనారాయణతోపాటు పలువురు ప్రముఖులు ఆయన్ని సత్కరించి అభినందనలు తెలిపారు.

## సాయిబాబాపై దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం : షిరిడి సాయిబాబా ఐక్యవేదిక



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంచికంటి ధనుంజయ, పి.వి.సాయి, గుండా మల్లయ్య తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** షిరిడి సాయిబాబాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని షిరిడి సాయిబాబా ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికంటి ధనంజయ, కార్యదర్శి పి.వి. సాయి, ఖజాంచి గుండా మల్లయ్య మాట్లాడుతూ ఇటీవలి కాలంలో కొందరు సోషల్ మీడియా వేదికగా అసత్య, ఆధారరహిత ప్రచారాలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రవచన కారులు మైనంపాటి ప్రసాద్, సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ సాయిబాబాపై అబద్ధపు ప్రచారాలు చేసి సమాజంలో కల్లోలం సృష్టిస్తూ కొందరు యూట్యూబ్ వీడియోల ద్వారా లాభాలు పొందుతున్నారని విమర్శించారు. ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్న వారికి తగిన గుణపాఠం చెబుతామని, వెంటనే ఆపకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలపై దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. షిరిడి సాయిబాబా సంస్థలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నాయని, దీనిని సహించలేని కొందరు స్వార్థపరులు చేస్తున్న ఆరోపణలను భక్త సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు సాయిబాబా శ్రవణ్ కుమార్, హనుమంతు, ప్రసాద్‌రావు, శ్రీదేవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రెండింతలు లాభం వచ్చేలా ధర నిర్ణయించాలి



సమావేశంలో దశరథంకు నియామక పత్రాన్ని అందజేస్తున్న కె.బి.శ్రీధర్

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** దేశానికి అన్నదాతలైన రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కాకుండా కనీసం రెండింతలు లాభం వచ్చేలా ధర నిర్ణయించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు రైతులకు లాభదాయకమైన విధానాలు అమలు చేయడంలో విఫలం చెందాయని కిసాన్ విభాగం నాయకులు ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, కిసాన్ విభాగం జాతీయ అధ్యక్షుడు సిద్ధంరెడ్డి శివశంకర్‌రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర నూతన కమిటిని ప్రకటించిన సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, రైతులు ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారని, వ్యవసాయం ప్రమాదకర వృత్తిగా మారడంతో అప్పుల భారంతో రైతు కుటుంబాలు కుంగిపోతున్నాయని, యువత వ్యవసాయానికి దూరం అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకుని రైతులకు మంచి చేయాలనే ఆలోచనలతో తమ పార్టీ కిసాన్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీలు వేసి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మాచర్ల దశరథం, ఉపాధ్యక్షుడిగా కె.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌ను ప్రకటించారు. ఈ సమావేశంలో సుధాకర్, పద్మిని, విజయకనకదుర్గ, భావిక్రప్రియ తదితరులు పాల్గొన్నారు.

### కల్తీలేని ఆహారానికే ప్రాధాన్యం: నటుడు సోనూసూద్



ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న నటుడు సోనూ సూద్, ఐఏఎస్ భవానీశ్రీ, సంతప్‌కుమార్, కార్తిక్‌రెడ్డి తదితరులు.

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కోవిడ్ తర్వాత ప్రతి ఒక్కరి ఆలోచనలు మారిపోయాయని, కల్తీ లేని ఆహార పదార్థాల పట్ల ప్రతి ఒక్కరూ దృష్టి పెడుతున్నారని నటుడు సోనూసూద్ అన్నారు. అశ్య ఫుడ్స్ ఉత్పత్తుల ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. తన దేహదారుఢ్యాన్ని కాపాడుకునేందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటానని, నాణ్యమైన ఉత్పత్తులు ఉన్నాయంటే దేశంలో ఎక్కడి నుంచైనా తాను తెప్పించుకుంటానని అన్నారు. రైతుల దగ్గరి నుంచి మార్కెట్‌కు రావడానికి మధ్యలో ఆ ఉత్పత్తుల్లో ఎన్నో మార్పులు జరిగి నకిలీవి తయారు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడొద్దని ఆయన కోరారు. ఈ సందర్భంగా అశ్య ఫుడ్స్ అధినేత శశిధర్‌రెడ్డి రూపొందించిన పసుపు, మిరియాలు, కారం, కినోవా తదితర ఆరు రకాల ఉత్పత్తులను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ హర్షిత వెలివాల, జాతీయ పసుపు బోర్డు సెక్రటరి, ఐఎఎస్ భవానీశ్రీ, పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, హైకోర్టు జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డి, కజికిస్తాన్ గౌరవ డాక్టర్ కౌన్సిల్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఐపీఎస్ రాజీవ్ త్రివేది, ఏఐసీసీ సెక్రటరి సంపత్‌కుమార్, బీఆర్ఎస్ నేత పటోళ్ళ కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

**-కోదండరామ్, గజ్జెల నాగేశ్**



సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద డ్రైవర్ శంకర్ గౌడ్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్, ఎమ్మెల్సీ కోదండరామ్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికులు చేపట్టిన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఎమ్మెల్సీ కోదండరామ్, తెలంగాణ ఉద్యమ నేత, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్‌లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 3వ రోజుకు చేరింది. సికింద్రాబాద్ జెబిఎస్ ప్రాంగణంలో కంటోన్మెంట్, పికెట్ డిపోలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట డిపోకు చెందిన శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడడం బాధకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం 5 కోట్ల రూపాయలు అర్థిక సహాయం అందజేసి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటాలు చేసి సమస్యను పరిష్కరించుకోవాలి కానీ ఆత్మహత్యకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసి నాయకులు నాగేశ్ పటేల్, చక్రవర్తి, శ్రీనివాస్, ఉదయ్, పాకాల ప్రభాకర్ పాల్గొన్నారు.

### సుమధురం ఆశాభోస్లే హిందీ సినీసంగీత విభావరి



ఇందిరను ఘనంగా సత్కరిస్తున్న అంజన్న, విజయ్‌కుమార్, మాణిక్‌రావు, నగేష్ తదితర గాయకులు, అతిథులు

**నాంపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ నగేష్ పర్యవేక్షణలో ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షురాలు డా. ఎన్.ఇందిర ప్రముఖ వర్తమాన గాయకులతో కలిసి హిందీ సినీసంగీత గాన విభావరి శీర్షికన 12 గంటలపాటు నిర్విరామంగా ఆలోపించిన ఆశాభోస్లే స్మరణలో హిందీ నాన్‌స్టాప్ మెలోడీస్ లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్-2026ను కైవసం చేసుకుంది. డా. రామకృష్ణ చంద్రమౌళి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సలహాదారుల కమిటీ సభ్యులు దరువు అంజన్న, నిర్మాత జి.విజయ్‌కుమార్, సినీనటుడు డా. సిహెచ్.మాణిక్‌రావు తదితరులు అతిథులు హాజరై ఇందిరను ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో పాటు సహ గాయనీ గాయకులను ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపారు.

### సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



మెరుగైన వైద్యానికి ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం, మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మోండా డివిజన్‌కు చెందిన ఎం.వెంకన్న కుమారుడు సంజీవరావ్, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు 1 లక్ష ఎల్ఓసీ పత్రాన్ని శుక్రవారం బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ ప్రాధాన్యత అని, మధ్య తరగతి కుటుంబలకు వైద్యం అందించేందుకు సిఎంఆర్ఎఫ్ నిధినిసద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ సీని యర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు.

### ఆసిఫ్‌నగర్‌లో అంగన్‌వాడీలను పరిశీలించిన కావ్య కిషన్ రెడ్డి



చిన్నారులతో కావ్య కిషన్ రెడ్డి ..

**కార్వాన్, ఏప్రిల్ 24(ప్రభాతవార్త)** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాంపల్లి నియోజకవర్గం, ఆసిఫ్ నగర్ డివిజన్, గుడిమల్కాపూర్ డివిజన్ లలో గల అంగన్వాడీ సెంటర్ లను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి సందర్శించి, అక్కడ కల్పించిన వసతులను పరిశీలించారు. ఆసిఫ్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు చిన్నబత్ని ముఖేశ్ మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భముగా అంగన్వాడీలలో చిన్నారులకు అందుతున్న విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలను ఆమె పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి అక్కడ అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. పిల్లలతో సరదాగా గడిపారు. వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కావ్య కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నబత్ని రేణుక, లావణ్య, గీత, గంగా ధర్, భుజందర్, పవన్‌రవికుమార్, శ్రీరాములు, లావణ్య, గీతా, డి.శ్రీనివాస్, చంద్ర శేఖర్, నరేష్, ఉదయరాజ్, రాజేష్, సాయి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



**కార్వాన్, ఏప్రిల్ 24(ప్రభాతవార్త)** కార్వాన్ నియోజకవర్గంపరిధిలోని మహబూబ్ ఫ్రైడ్ ఫంక్షన్ హాల్‌లో 169 షాదీ ముబారక్, 258 కల్యాణ లక్ష్మి పథకం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎంఐఎం పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ హాజరై ఆసిఫ్ నగర్ మండల పరిధిలోని లబ్ధిదారులకు రూ.4,27,49,53 2ల 169 షాదీ ముబారక్, 258 కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్ నగర్ మండల్ ఎంఆర్ఓ, ఏఐఎంఐఎం పార్టీ మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ పార్కింగ్‌తో రాకపోకలకు అంతరాయం

**-తొలగించాలంటూ బస్తీవాసి కమ్యూనిటీ పోలీసు బేగంపేట గ్రూపులో పోస్ట్..**

**బేగంపేట ఏప్రిల్ 24,ప్రభాతవార్త**

బేగంపేటలో రాంగ్ సైడ్ పార్కింగ్ తో రాకపోకలకు అంతరాయంగా మారిందని, వెంటనే రాంగ్ సైడ్ పార్కింగ్ చేసిన వాహన దారులను గుర్తించి వెంటనే వాహనాలను తొలగించేలా చూడాలంటూ ఓ యువకుడు కమ్యూనిటీ పోలీసు బేగంపేట గ్రూపులో పోస్ట్ చేసాడు. బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రకాశం నగర్ పాత వాటర్ ట్యాంక్ గల్లీలో రాంగ్ సైడ్ లో కార్లు పార్కు చేయడంతో స్థానికులకు ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అంతరాయంగా మారిందంటూ యువకుడు శివ ఆవేదన వ్యక్తం చేసారు. ఇదిలా ఉండగా బేగంపేట లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో సంబందిత శాఖ అధికారులు ఫెయిల్యూర్ అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బేగంపేట ప్రధాన రోడ్డులో నిత్యం గవర్నర్, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారు సైతం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి వారి ప్రయాణాలను సాగిస్తుంటారు. అయితే ఇలాంటి రోడ్డు మార్గంలో కొన్ని బస్టాప్‌లు కబ్జా చేసిన కొందరు వ్యాపారులు ప్రయాణీకులు కూర్చునే వీలులేకుండా తమ వ్యాపారాలు చేస్తుండటం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. నిత్యం ముఖ్యమంత్రి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని వివిధ రాష్ట్రాలు, వివిధ జిల్లాలకు వెళుతుంటారు. ఇలాంటి వివిఐపీ మార్గంలో పోలీసులు వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం నాయకుల బధ్రతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మందు బాబులైతే ఏకంగా ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న బస్టాపులలోనే బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని, వీరితో బస్సు ప్రయాణం చేసే మహిళలకు, విద్యార్థినిలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందన్న ఆరోపణలు ఇదే గ్రూపులో వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్, లాఅండ్ ఆర్డర్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయం చేసుకుని ఇలాంటి చర్యలు జరగకుండా నిరోధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమించాలి : మంద క్రిష్ణ మాదిగ



సికింద్రాబాద్ వైఎంసీఏలో దళిత క్రైస్తవుల సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మార్పీఎస్ నేత మంద క్రిష్ణ మాదిగ

**కంటోన్మెంట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు దళిత క్రైస్తవులంతా సంఘటితంగా ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందక్రిష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో నిర్వహించిన దళిత క్రైస్తవుల హక్కుల కోసం ఏర్పాటు చేసిన ఐక్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సిక్కు మతం దళితులకు, బౌద్ధ మతంలోని దళితులకు ఎస్సీ హోదాను కల్పించగా దళిత క్రైస్తవులకు ఎందుకు ఎస్సీ హోదా తొలగించడం సరైంది కాదన్నారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న కుల వివక్షత మీద ఆధారాలను జస్టిస్ బాలక్రిష్ణన్ కమిటీ ముందు పెట్టాలన్నారు. 1950 ఆర్టికల్ రాజ్యాంగ విరుద్ధమని, దళిత క్రైస్తవుల మీద కుల వివక్షత తొలగిపోలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల దళిత క్రైస్తవ సమాజం తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. దళిత క్రైస్తవ సమాజానికి ఆత్మస్థైర్యం కల్పించడానికి ఎమ్మార్పీఎస్ ముందుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం మూడు దశాబ్దాలుగా పోరాడిందన్నారు. చివరి ఘట్టంలో బిజెపి అండగా నిలిచిందన్నారు. న్యాయం, ధర్మం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఐఏసీఎఫ్ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావ్, ఫాస్టర్ సంతు జూలియస్, డేవిడ్ కదారి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర పండుగగా గుర్తింపు జాతికే గర్వకారణం: సుధీర్‌మంకాల



**జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవి కన్యకాప రమేశ్వరీ జయంతి ఉత్సవాలను రాష్ట్రపండుగగా గుర్తించి ప్రభుత్వం వైశ్యుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచిందని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రచారకమిటీ నిర్వాహకులు సుధీర్‌మంకాల అన్నారు. జగద్గిరిగుట్ట శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగాణంలో కుత్బుల్లాపూర్ వైశ్యలయన్స్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాతతోపాటు ప్రభుత్వంపై ప్రత్యేకశ్రద్ధతో వత్తిడితెచ్చి రాష్ట్రప్రభుత్వ పండుగగా శ్రీవాసవి జయంతిని ప్రకటించేలా చేసిన ప్రతిఒక్క ఆర్యవైశ్యుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట శ్రీవాసవి మాత దేవాలయ ట్రస్టు ఫౌండర్‌చైర్మెన్ రేగూరి ప్రవీణ్‌గుప్తా, అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకులు బండారు వరప్రసాద్‌గుప్తా, వైశ్యలయన్స్ ప్రతినిధులు ఇంద్రసేనగుప్తా, నందుగుప్తా, పోలా రమేశ్‌గుప్తా, కుత్బుల్లాపూర్ పట్టణ ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షులు నాంపల్లి విజయ్ గుప్తా, నాయకులు గోలి రమేశ్‌గుప్తాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా జై వాసవి, జైజై వాసవి అంటూ పెద్దఎత్తున నినాదాలుచేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

## నవరసభరితం శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం

**నాంపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీ సాహితీ నాట్యకళామండలి ఆధ్వర్యంలో అష్టలక్ష్మి దేవాలయం ఇష్టిసహిత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రదర్శింపబడిన శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం నవరసభరితంగా సాగి ఆహుతులను కట్టివేసింది. ముఖ్యంగా మల్లాది వెంకటరమణ శ్రీకృష్ణ పాత్రలో పాడిన పద్యాలు వీనులవిందు చేశాయి. మల్లాది శ్రీసాయిహరీష్ నేతృత్వంలో జరిగిన పద్యనాటక ప్రదర్శనలో శ్రీకృష్ణుడుగా కిషోర్‌కుమార్, దుర్యోధనుడుగా వెంకటేశ్వరరావు, అర్జునుడుగా ప్రసన్నాంజనేయులు తమతమ పాత్రలకు ప్రాణంపోసి రక్తికట్టించారు. జి.సాహితి భక్తిరస గీతాలు ఆధ్యాత్మికతను రేకెత్తించాయి. ప్రదర్శనాంతరం జరిగిన సభాకార్యక్రమంలో కమిటీ కల్చరల్ చైర్మన్ కొత్త పరమేశ్వరరావు, కోచైర్మన్ వనజా, కె.సౌందర్య. శ్రీచాడేశ్వరి నాట్యకళామండలి గౌరవాధ్యక్షుడు పి.వి.సుబ్బారావు, డా. ఎస్. ఆనందం, కళాపోషకుడు గోపీనాథ్‌జైన్ తదితరులు పాల్గొని కళాకారులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.


హ్యాపీ బర్త్‌డే



పాప పేరు : యామిని

తల్లిదండ్రులు : నరేష్, సంధ్య రాణి


## నేను బిజెపిలో చేరడంలేదు

**-మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** గత కొంతకాలంగా బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి చెక్ పెట్టారు. బీజేపీలో చేరడం లేదని వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె నాంపల్లిలోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. పార్టీ కార్యాలయంలో ఆమె పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారితో సమావేశమయ్యారు. ఈ భేటీపై ఆమె మీడియాతో మాట్లాడుతూ, తమ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో ఏఐ క్యాంపస్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు తెలిపారు. సామూహిక వందే మాతర గీతాలాపన కోసం కూడా మోదీని ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే ఇవాళ బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. మా మామ మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటారు అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

### ద్విచక్ర వాహనానికి నకిలీ నంబర్ ప్లేట్ ..నిందితుడిపై కేసు నమోదు

**కార్వాన్, ఏప్రిల్ 24(ప్రభాతవార్త)** సిటీ ట్రాఫిక్ పోలీసులు తమ తనిఖీలలో ఒక వాహనదారుడు నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని హైదరాబాద్ నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టోలిచౌకి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వివరాలు..మొహమ్మద్ మోయినుద్దీన్ తన హోండా యాక్టివా వాహనం యొక్క అసలు నంబర్ టీ.ఎస్12ఈ ఆర్ 2466కు బదులుగా, టీ.ఎస్11ఈయూ5327గా నకిలీ నంబర్ వాడటం వల్ల నిందితుడిపైటోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేశారు.


వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, Darshana Kartik Jadhav wife of Kartik P Jadhav R/O 1-2-57 TO 61 F N0-104, Pasam Sattiah apts, Himayathnagar, HYDERABAD. PIN: 500029, Telangana. have changed my name to Darshana Jadhav for all record purposes.

★ I, Shankhala Ritesh Kishen S/o. Keshav lal Patel, R/o. H.No.5-9-6-4A, Plot No.5, Road No.3, Laxminagar Colony, Kothapet, Saroornagar, Hyd. Have Changed My Name As Ritesh Patel for the Purpose of All Records.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం

**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**

టెండర్ ప్రకటన ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)

NIT No. 03/EE/CMC/CIR-48/2026-27 తేది: 24.04.2026

No.No. 03/EE/CMC/CIR-48/2026-27 ప్రకారం (ఐటమ్ నం.01) తేది: 24.04.2026, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.40.00 లక్షల యొక్క అంచనా ధరతో (01) పనులకు టెండర్‌లు పిలవబడుతున్నవి. బిడ్స్ విక్రయం 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో 25.04.2026న మ.2.00గం. ఆపై నుండి తెరువబడి ఉంటుంది మరియు బిడ్స్ దాఖలుకు చివరి తేది: 02.05.2026 మ.2.00గం. పత్ర మరియు బిడ్స్ విక్రయం దాఖలు సమయానికి ఒక గంట ముందు ముగించబడుతుంది. తదుపరి వివరాలు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in పై చూడవచ్చు.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, SLP జోన్: CMC.

DIPR.NO. 1380-PP/CL/ADVT/1/2026-27 తేది: 24.04.2026

**PUBLIC NOTICE**

**Loss of Original Will Deed Document**

General Public hereby call upon you that my client **BEMAGONI RANI (Cell No. 7013954237) W/O. LATE BEMAGONI RAMU,** R/o. Door No. 2-2-1055/26/B/1/B, Pochamma Basthi, Amberpet, Hyderabad-500013, Telangana, has lost her original will deed document No. 177/III/2020, dated: 27-07-2020, Regd.at SRO Chikkadpally, Hyderabad, of house property southern portion of Door No. 2-2-1055/26/B/1/B, consisting of Ground + First floor, admeasuring 49.67 Sq.yds, situated at Pochamma Basthi, Amberpet, Hyderabad, Telangana, if anybody have trace out it or/found/ kept with you while misplaced/lost the original regd. Will Deed doct by my client, please inform over Telephone or send it to the above said address or below said address.

**Sd/- P.S. NAGESH**
**M. RAJITHA**
**Advocates**
H.No.3-5-385, Flat No.G-1, Omsree RK Enclave, Vittalwadi, Narayanaguda, Hyderabad-29.
**Cell: 7013954237, 9885317896**
Place: Hyderabad
Date: 24-04-2026

**IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM VIII ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL MALKAJGIRI AT MEDCHAL**

**O.S. No. 186 OF 2026**

Between:-
Sadath Jahan Begum & ors ....Plaintiffs
And
The Tahsildar & Anr ...Defendants

To,
All Concerned ....Defendant No.2

Whereas the above named plaintiffs filed a suit for declaration to declare the plaintiffs as the legal heirs of Md Sardar Pasha & Noor Jahan Begum against you and the same stands posted to 27-04-2026. You are hereby directed to appear on 27-04-2026 at 10:30 AM either in person or through pleader, else the matter will be heard and decided Ex-parte.

**//BY ORDER OF COURT //**

Sd/- Shaik Abid
Advocate
D.No. Off: 9-1-19,
Hasmathpet, Old Bowenpally,
Mobile: 7799169442

## ఉప్పల్ డిపో ఎదుట బిఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ధర్నా


ఉప్పల్ బస్ డిపో ముందు ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం అయ్యిందని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ కార్మికులకు మద్దతు ఉప్పల్ బస్ డిపో ముందు పలువురు పార్టీ నేతలతో కలిసి భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గారు ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల కోసం పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో బలవర్మణానికి పాల్పడ్డ శంకర్ గౌడ్ మరణంముమ్మాటికి ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు హామీలు ఇచ్చి మోసం చేసిందని, వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలించలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించకపోతే మరో సకల జనుల సమ్మె తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఆర్టీసీ సమ్మెను భగ్నం చేసే కుట్ర జరుగుతోందని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు పల్లె రాజ్‌కుమార్‌గౌడ్, సత్యరాజ్‌గౌడ్, బిజెపి నేత తాడూరి శ్రీనివాస్, పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి : శ్రీనాథ్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ సమ్మేళనం కార్యక్రమ ఆహ్వాన సమితి అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పిల్లారిశెట్టి శ్రీనాథ్, ఉపాధ్యక్షులు కేవీ కృష్ణారావు, లింగాల హరి గౌడ్, మడిగల విజయభాస్కర్ రెడ్డి, నవీన్ పటాలే తదితరులు

**మలక్ పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం కార్యక్రమ ఆహ్వాన సమితి అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పిల్లారిశెట్టి శ్రీనాథ్, ఉపాధ్యక్షులు కె.వి కృష్ణారావు లు పేర్కొన్నారు. హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ఏపీఎయు కాలనీ ధర్మనీయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆస్మాన్ ఘడ్ డివిజన్ పరిధిలోని గడ్డి అన్నారం కళ్యాణ్ నగర్ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్ద ఈ నెల 26 వ తేదీ ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నమని వివరించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశ మంతటా హిందూ సమ్మేళనం కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 26న సాయంత్రం రాఘవేంద్ర టిఫిన్స్ వద్ద హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని హిందూ సంఘటిత శక్తి ని చాటాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాలుగా హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, దేశభక్తిని మేల్కొల్పుతూ, హిందూ సమాజం తన అస్తిత్వాన్ని సగర్వంగా చాటుకోవడంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారత్ ను విశ్వం గురువు గా నిలబెట్టేందుకు, ధర్మరక్షణే ధ్యేయంగా హిందువులందరూ సంఘటితం కావాలన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు మడిగల విజయ భాస్కర్ రెడ్డి, లింగాల హరిగౌడ్, పటాలే నవీన్‌కుమార్, శ్యాం గౌడ్, శ్రీధర్, నారాయణ మూర్తి, చక్రధర్ పాల్గొన్నారు.

## దిల్‌షుక్ నగర్ ఆర్టీసీ డిపో వద్ద శంకర్ గౌడ్‌కు ఘన నివాళి


ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి, కార్మికులు తదితరులు.

**మలక్ పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో వద్ద మూడవ రోజు సమ్మె ఉధృతంగా కొనసాగింది. దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో వద్ద ఉదయం రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి, కార్మికులు డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవేశంతో ఇటువంటివి జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మూడవ రోజు సమ్మె ఉధృతంగా జరుగుతోందని తెలిపారు. సమ్మె వలన అటు ప్రయాణికులకు, నూతన డ్రైవర్లను అపాయింట్ చేసుకుని ప్రమాదాలకు కారణమవుతున్నటువంటి అధికారులకు, ఉద్యోగులకు ఇబ్బందికరమైనటువంటి పరిస్థితులు కాబట్టి చర్చలు చేపట్టి సత్వర పరిష్కారాన్ని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో డిపో జేఏసీ నాయకులు మోహన్, రవీందర్, అశోక్, వెంకటయ్య, జేపీ రెడ్డి, యాదయ్య, స్వప్న , శ్రీదేవి, తెలంగాణ శంకర్, నిరంజన్, దయానంద్, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత సేవలకు గౌరవం..దళిత రత్న అవార్డుల ప్రదానం
### : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**నేరెడ్‌మెట్ , ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** సమాజంలో దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడం అవసరమని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దళిత రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం సేవలు అందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం సమాజానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. వివిధ రంగాలలో దళిత నాయకులు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు ప్రదానం చేయడం శుభ పరిణామమని అన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, వైద్య రంగాల సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దళిత రత్న అవార్డుల ప్రదానానికి కృషి చేసిన రావుల అంజయ్య, శరణగిరి తదితరులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. దళిత రత్న అవార్డు గ్రహీతలు: శివశంకర్, మహేష్, సర్వేష్, భాస్కర్, స్వామి, వీరేష్, మునియా నాయక్, పెంటయ్య, రవీందర్, నరేష్, రంజిత్, సంజీవ, గణేష్ నాయక్, గణేష్, నర్సింగ్ తదితరులు. ఈ కార్యక్రమంలో రావుల అంజయ్య, శరణగిరి, ఇతర నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సర ఫరా నిలిపివేస్తున్నామని ఏఇ ఎం.నిఖిల్ తెలిపారు. ఉప్పల్ బ్యాంక్ కాలనీ, ఫీడర్ పరిధిలోని బ్యాంక్ కాలనీ, ప్రశాంతినగర్, బీరప్పగడ్డ, ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్, జాహిద్‌నగర్, పిస్తా హౌజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి పదిన్నర గంటల వరకు, అదే విధంగా 11 కెవి ఎసియన్ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ ప్రధాన రహదారి, స్వరూప్‌నగర్, ఎసియన్ దియేటర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు నిలిపివేస్తున్నామని తెలిపారు.

## ముందస్తు వైద్య పరీక్షలతోనే కిడ్నీ క్యాన్సర్‌కు చెక్ : డాక్టర్ శ్రీనివాస నారాయణం

**మలక్ పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ముందస్తు వైద్య పరీక్షలతోనే కిడ్నీ క్యాన్సర్‌ను అరికట్టగలమని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆసుపత్రి యూరాలజీ హెచ్‌ఓడి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనివాస నారాయణం, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ అరుణ్‌లు పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య పరీక్షల పట్ల అప్రమత్తంగా ఉండటం ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. దిల్ షుక్ నగర్ లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎటువంటి లక్షణాలు లేకపోయినప్పటికీ వైద్య పరీక్షలో 8 సెంటీమీటర్ల గడ్డ ఎడమ కిడ్నీలో బయటపడడం జరిగిందని, ఎటువంటి ముందస్తు లక్షణాలు లేకపోయినప్పటికీ, సాధారణ హెల్త్ చెకప్‌లో ఓ వ్యక్తికి ప్రాణాంతక కిడ్నీ క్యాన్సర్‌ను గుర్తించి విజయవంతంగా చికిత్స అందించమని వివరించారు. నగరానికి చెందిన 42 ఏళ్ల వ్యక్తికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు (బీపీ, షుగర్ వంటివి) లేవని, ధూమపానం అలవాటు కూడా లేదని, అయితే ఇటీవల ఆయన చేయించుకున్న సాధారణ మాస్టర్ హెల్త్ చెకప్‌లో భాగంగా చేసిన అబ్డామినల్ అల్ట్రాసౌండ్ పరీక్షలో ఎడమ కిడ్నీలో సుమారు 8 సెంటీమీటర్ల మేర పెరిగిన గడ్డ (మాస్) బయటపడింది. వెంటనే సీటీ స్కాన్ నిర్వహించగా అది కిడ్నీ క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. దీంతో దిల్ షుక్ నగర్ లోని ఎఐఎన్యు ఆసుపత్రిలో యూరాలజీ హెచ్‌ఓడి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనివాస నారాయణం, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ అరుణ్ తదితర వైద్య బృందం ఆ రోగికి రాడికల్ నెఫ్రెక్టమీ (సర్జరీ ద్వారా కిడ్నీ తొలగింపు) శస్త్ర చికిత్స ను విజయవం తంగా నిర్వహించింది. పరీక్షల్లో అది క్లియర్ సెల్ రీనల్ సెల్ కార్సినోమాఖిగా తేలింది. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలు కుని ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. నిశ్శబ్దంగానే ఎటువంటి లక్షణాలు కనిపించకుండా ఈ వ్యాధి వస్తుందని, అప్రమత్తతతో ప్రాణాపాయం నుంచి రోగి బయటపడడం జరిగిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 4.3 లక్షల కొత్త కిడ్నీ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని 70 నుంచి 80 శాతం కిడ్నీ కణితులు ఎటువంటి లక్షణాలు లేకుండానే పెరుగుతాయని వివరించారు. మూత్రంలో రక్తం రావడం, నడుము నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే అది వ్యాధి ముదిరినట్లు లెక్క అని పేర్కొన్నారు. అందుకే ముందస్తు పరీక్షలు చాలా ముఖ్యం అని స్పష్టం చేశారు. చిన్న గడ్డలను పార్షియల్ నెఫ్రెక్టమీఖి ద్వారా కిడ్నీని కాపాడుతూనే తొలగించవచ్చని, పెద్ద గడ్డలకు మొత్తం కిడ్నీ తొలగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏడాదికి ఒకసారి కనీసం అల్ట్రాసౌండ్ పరీక్ష చేయించుకోవ డం వల్ల ఇలాంటి సైలెంట్ కిల్లర్స్ నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కిడ్నీ సంబంధిత సమస్యలు లేదా స్కానింగ్‌లో ఏవైనా తేడాలు కనిపిస్తే వెంటనే నిపుణులైన యూరాలజిస్టులను సంప్రదించాలని కోరారు.


ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు శ్రీనివాస నారాయణం, సుభాష్ చంద్రబోస్, అరుణ్ తదితరులు

## హైకోర్టు ఆదేశాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు : ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌ల్లో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికతో హైకోర్టు జారీచేసిన ఆదేశాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక మేరకు హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ నివేదిక ఆధారంగా మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన వివరించారు. కమిషన్ విచారణ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉందని తమ వాదనలను వినలేదని మాజీ సిఎం కేసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారన్నారు. జస్టిస్ ఘోష్ నివేదిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు కాంగ్రెస్ నేతలు స్పందించాలన్నారు. హైకోర్టు తీర్పు స్వాగతించాల్సిన విషయమని, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాధారమని, కేసిఆర్, హరీష్‌రావులపై కాంగ్రెస్ కుట్రలను బీఆర్ఎస్ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికుడు శంకర్‌గౌడ్‌కు నివాళులు అర్పించడానికి వెళుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరాశను వ్యక్తం చేయడానికి వెళుతున్న ఎమ్మెల్యేను అడ్డుకోవడం అప్రజాస్వామికం అన్నారు. ఆర్టీసీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను తీర్చాలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, మారోజు రామాచారి, గొడుగు శ్రీనివాస్‌ముదిరాజ్, కంచెర్ల శేఖర్, సిద్దగోని వెంకటేష్‌గౌడ్, కొండ్రు శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, ముచ్చింతల జగన్, బాలుశ్రీ, శ్రీమన్నారాయణ, వీరాస్వామి, మల్లేష్, నయిమ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

## ఎస్సీ, ఎస్టీ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**నేరెడ్ మెట్ , ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** సమాజంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సైనిక్‌పురిలో నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, యువతకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని విద్య, వైద్య రంగాల్లో ముందంజ వేయాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలోని ఇతరులను కూడా ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు, సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, మార్కెట్ అవకాశాలపై అవగాహన పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యాపారం కేవలం ఆదాయ వనరు మాత్రమే కాకుండా, స్వాభిమానాన్ని పెంపొందించే శక్తిగా, ఆత్మనిర్భరతకు బాటలు వేసే సాధనంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐసీసీ తెలంగాణ ఎస్సీ ఎస్టీ అధ్యక్షుడు నల్ల బాబు, జోనల్ మేనేజర్ సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్‌హెచ్ఓ సురేష్, జిల్లా ఎల్‌డీఎం మేనేజర్ శివప్రసాద్, ఏ.డి. జయంతి, లంబోధర్ మిశ్రా, వెంకటేశ్వరరావు, అబ్దుల్ ఖాదర్, ప్రతినిధులు సహదేవ్, నర్సింగ్ రావు, శ్రీనివాస్, అంజయ్య, పార్టీ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న, మురుగేష్, శివగౌడ్, చిన్నం శ్రీనివాస్, హేమంత్ పటేల్, సుమన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం


ఫోన్లు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి, దయానంద్‌గుప్తా, మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, మధుయాష్కి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలో దివ్యాంగులకు వాహనాల(త్రి చక్ర స్కూటీలు) పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో బొగ్గారపు దయానంద్‌గుప్తా, మల్‌రెడ్డి రాంరెడ్డి, మధుయాష్కితో హాజరై నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రేణుక, డిడిఆర్ సి.రమేష్, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్‌గౌడ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్, డాక్టర్ బి.విజయరంగ, సురేందర్‌రెడ్డి, ఎస్.కె.షరీఫ్, శ్రీపాల్‌రెడ్డి, పన్యాల జయపాల్‌రెడ్డి, గణేష్‌నాయక్, భవానిశంకర్, బొగ్గరాపు శరత్, చెరుకు చిరంజీవి, దాము మహేందర్‌యాదవ్, బొగ్గారపు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సినాప్స్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


ర్యాంకర్లను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేసిన చందన్‌బాబు, జిఎం గోపాల్‌రెడ్డిలు: చిత్రంలో ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ బాబ్జి తదితరులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** జాతీయ స్థాయి సినాప్స్ పోటీల్లో సత్తా చాటిన మీర్‌పేట్ నారాయణ ఒలంపియాడ్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. సినాప్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో మీర్‌పేట్ నారాయణ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి ఆల్ ఇండియా లెవల్‌లో అత్యున్నత ర్యాంకులను సాధించడం జరిగింది. ఎన్.కృతిక్ నాయక్ 2వ ర్యాంకును, ఆధ్య 4వ ర్యాంకును, పర్ణిక 5వ ర్యాంకు, ఇశితారెడ్డి 5వ ర్యాంకును, జె.భార్గవి 6వ ర్యాంకును సాధించారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన విజయభేరి అభినందన సభలో వారిని ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ చందన్‌బాబు, నారాయణ గ్రూపు జిఎం గోపాల్‌రెడ్డిలు సన్మానించి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎజిఎం రవీంద్రబాబు, ఆర్అండ్‌డి బృం దం శివరంజని, మహేశ్వరి, సిఒ సృజన్ రాథోడ్, దివ్య, ప్రిన్సిపాళ్లు బాబ్జి,ధరణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్టాపన


వాసవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పూజలు నిర్వహిస్తున్న తెరటిపల్లి శ్రీనివాస్‌గుప్త, పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, యిరువెంటి సురేష్‌గుప్త దంపతులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని మీర్‌పేట్ జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ ఆర్‌సిఐ రోడ్డులో నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాతపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో భవ్యంగా నిర్మితమైన ఈ దేవాలయంలో గురువారం నుండి వాసవి కన్యకా పరమేశ్వరి, గణపతి, స్ఫటికలింగ సహిత సరస్వతి, ధ్వజస్థంభ ప్రతిష్టాపనోత్సవ పూజా కార్యక్రమాలు వైభ వంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రెండవ రోజు దేవతా పూజ గాయ మంటప దేవతా హవనం, జలా ధివాస హవనం, మూల మంత్ర హోమాలు నిర్వహించా రు. ఉదయం 11 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. ప్రతిష్టాపనోత్సవాలను నిర్వహిస్తున్న చైర్మన్ తెరటిపల్లి శ్రీనివాస్‌గుప్త, అధ్యక్షుడు పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, ప్రధాన కార్యదర్శి యిరువెంటి సురేష్‌గుప్త, కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్త తదితరులు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్టాపన చేయనున్న శృంగేరి పండితులు, యాగ బ్రహ్మ విరివింటి ఫణి శశాంక శర్మ, ఉభయ భారతి విద్యా పీఠం వ్యవస్థాపకులు వ్యాసోజ్జల గోపికృష్ణ శర్మలకు ఘన స్వాగతం పలికారు.


సమ్మె సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్తున్న బిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నాయకురాలు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని రఘునాథపల్లి టోల్‌గేట్ వద్ద అడ్డుకున్న పోలీసులు


మహేశ్వరం డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి దివంగత డ్రైవర్ శంకర్‌గౌడ్‌కు నివాళులర్పిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ కాంటెస్టెడ్ బిజెపి ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్: చిత్రంలో మీర్‌పేట్ కార్పొరేషన్ సెక్టార్-2 బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ తదితరులు

## కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లు ప్రధానం


మహిళలకు సర్టిఫికేట్లు ప్రధానం చేసిన యుసిడి అధికారి పద్మావతి, సురేష్ తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని సూర్య నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో స్కూల్ యూనిఫాం కుట్టు శిక్షణ తీసుకున్న శుక్రవారం సర్టిపికేట్లు ప్రధానం చేశారు. ఈ మేరకు సూర్యనగర్‌లో జరిగిన సమావేశంలో మల్కాజిగిరి కమిషనరేట్ యుసిడి పిడి సురేష్, ఉప్పల్ సర్కిల్ పిడి జెపద్మావతి, డిఎంసి భానుప్రకాష్, కమ్యూనిటి సూపర్‌వైజర్లు వాణి, శ్రీధర్‌రెడ్డి, శిక్షకులు అనురాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కూల్ యూనిఫాం కోసం శిక్షణ తీసుకున్న మూడో బ్యాచ్ మహిళలకు సర్టిపికేట్లు ప్రధానం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల దుస్తులతోపాటు, స్వయంగా వారు ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఎల్ఓసి అందజేత


చిలుకానగర్‌కు చెందిన జి.రాజప్పకు ఎల్ఓసి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌కు చెందిన గూడూరు రాజప్ప కుమారుడు శైలేష్ వీపులో కణితి సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి విన్నవించడంతో వెంటనే స్పందించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. అయితే ఆపరేషన్ సమయంలో సమస్యలు తలెత్తడంతో మరోసారి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుని రాగా, ఆయనకు రెండో విడతగా రూ.2 లక్షల 25 వేల ఎల్ఓసి మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో మొత్తం రూ.4 లక్షల 25 వేల రూపాయల సహాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ఈరెల్లి రవీందర్ రెడ్డి, కోలాని సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాసవిమాత జయంతిని పండుగగా ప్రకటించిన సిఎంకు కృతజ్ఞతలు : ఉప్పల


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వాసవిమాత జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సమాజం హర్షం వ్యక్తం చేస్తోందని, ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆర్య వైశ్యుల తరుపున టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవిమాత జయంతి అనేది ఆర్యవైశ్యుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అన్నారు. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి రోజున జరుపుకునే ఈ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ద్వారా ప్రభుత్వం ఆర్యవైశ్యుల భావోద్వేగాలను గౌరవించినట్టయిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం వాసవిమాత జయంతి రోజున రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం ఎంతో అభినందనీయం అన్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు వాసవిమాత జయంతి ఉత్సవాలు మరింత భక్తి, శ్రద్ధలతో నిర్వహించబడతాయని అన్నారు.

## చిన్నారుల క్రీడల శిక్షణా శిబిరం ప్రారంభం

**హుడాకాంప్లెక్స్, 24 ఎప్రిల్, ప్రభాతవార్త :** స్పోర్ట్స్ అథారిటీ అఫ్ తెలంగాణ, రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయం అధ్వర్యంలో శుక్రవారం రూర్‌నగర్‌లోని ఇండోర్ స్టెడియంలో చిన్నారులకు క్రీడలలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.స్వర్ణలత మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో బాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, క్రికెట్, స్విమింగ్, లాంగ్‌జంప్, స్కెటింగ్, వాలీబాల్,భాక్సింగ్, కబడ్డీ,టెబుల్ టెన్నిస్ విభాగాల్లో అనుభవజ్ఞులైన కోచర్లద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా చిన్నారుల్లో క్రీడలపై అసక్తి పెంపొందించడం, శారీరక దారుడ్యాన్ని మెరుగుపరచడం, క్రమశిక్షణ, సమయ పాలన, జట్టుబావన వంటి విలువలను అభివృద్ధి చేయడం జరుగుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించబడుతూ, అసరమైన క్రీడా పామాగ్రి, మౌళిక వసతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే పిల్లలు తమ ప్రతిభను మెరుగుపరుచుకుని భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించేందుకు మంచి వేదికవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిక్షణ కార్యక్రమంలో నమోదు చేసుకుని వారి క్రీడా భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని అమె కోరారు.

## చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురి అరెస్ట్
### -15 గ్రాముల బంగారు మంగళ సూత్రం స్వాధీనం

**మలక్ పేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** చైన్ స్నాచింగ్ కు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 15 గ్రాముల బంగారు మంగళ సూత్రం స్వాధీనం చేసుకున్న సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి కథనం ప్రకారం ఈనెల 22వ తేదీన పోతరాజు రాణి (31), పోతరాజు భాగ్య శ్రీ (26), వాగ్ మారే ప్రశాంత్(31)లు ముసారాంబాగ్ లో నివసిస్తున్న బాధిత మహిళ వద్దకు వచ్చి అద్దెకి ఇల్లు ఉంటే చూపించాలని అడుగుతూ బాధిత మహిళ దృష్టిని వారు మళ్ళించి ఆమె మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని లాక్కొని ఆమెని గదిలో బంధించి పారిపోయారు. దీంతో బాధితురాలు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ అధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా చైన్ స్నాచింగ్ కు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి 15 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అమరవాది లక్ష్మీనారాయణ

**సైదాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత అమ్మవారి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం రాగానే ఆర్యవైశ్య కార్పొరేషన్ను ప్రకటించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇటీవల శ్రీ వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, దీనికి అనుగుణంగా వాసవి మాత జయంతికి నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం తెలంగాణ ఆర్యవైశ్యులకు గర్వకారణం అన్నారు. ఏప్రిల్ 26న అమ్మ వారి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఆగిరి వెంకటేష్, కండె మల్లికార్జున్, చింతల రవికుమార్, అర్థం లక్ష్మయ్య, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందే సురేష్, బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, సామ్రాజ్యలక్ష్మి, కాచం సుష్మ, జిల్లా ఆర్య వైశ్య సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్ గుప్తా, కొండూరు శ్రీకాంత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



**తుర్కయంజాల్ ఏప్రిల్ 24( ప్రభాతవార్త)** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిని నిరసిస్తూ, ఆర్టీసీ జేఏసీ నాయకులు జెల్లా పర్వతాలు నేత ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ పోరాటానికి ఏఐటీయూసీ, సిఐటియు మరియు సిపిఐ, సిపిఎం నాయకులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఒరుగంటి యాదయ్య సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కిషన్ మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాయడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని విమర్శించారు. ప్రైవేటీకరణ వద్దు విలీనమే ముద్దు ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, సంస్థను ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. వరంగల్ జిల్లా నర్సాపూర్ డిపోలో ఆందోళన చేస్తూ ప్రాణాలర్పించిన శంకర్ గౌడ్ కు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జెల్లా పర్వతాలు నేత, కె.ఎస్.ఎన్ రెడ్డి, పి.ఆర్ రెడ్డి, రమేష్, సైదులు రెడ్డి, ఎస్. సత్యనారాయణ, బి. లక్ష్మారెడ్డి, ఎం. వెంకటేష్ సిపిఐ, సిపిఎం నాయకులు ఏ. కాటంరాజు గౌడ్, పి. శివకుమార్ గౌడ్, అరుణ్ కుమార్, శివ ప్రసాద్, పాల్గొన్నారు

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి : ఎంఆర్ఓ


ఓటరును మ్యాపింగ్ గురించి వివరిస్తున్న తహసీల్దార్

**హుడాకాంప్లెక్స్, 24 ఎప్రిల్, ప్రభాతవార్త :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సరూర్‌నగర్ తహసీల్దార్ పి. వేణుగోపాల్ సూచించారు. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం, సరూర్‌నగర్ మండలానికి సంబంధించిన సహాయ ఎన్నికల నమోదు అధికారులు, సూపర్వైజర్లు. బీఎల్ఓలతో శుక్రవారం సమీక్షసమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ఓటర్లందరిని 2002 ఓటరు జిబితాతో అనుసంధానం చేయాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ 53 శాతమే అయిందని, మిగతా ప్రక్రియ సాగుతుందని పేర్కొంటూ బీఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి ఓటర్ల వివరాలు సేకరించి వారంలోగా మ్యాపింగ్ పూర్తిచేయాలని అదేశించారు. అలాగే రాజకీయ పార్టీకు చెందిన బీఎల్ఓల సహకారం తీసుకోవాలని , రెసిడెన్షియల్ కాలనీలలో సమావేశాలు నిర్వహించి ప్రతి ఓటరు మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కూడా సహకరించి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. కొత్తగా ఓటుహక్కు వచ్చిన వారు కూడా బీఎల్ఓలను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్, అర్ఐ జ్యోతితో కలిసి స్వయంగా సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని 8 ఓటింగ్ బూత్‌లోని ఓటరు ఇంటికి వెళ్లి బీఎల్ఓతో కలిసి మ్యాపింగ్ గురించి వివరించి పలు సూచనలు చేశారు.

## తార్నాకలో ఘనంగా సత్యసాయి సేవా కార్యక్రమాలు


అన్నప్రసాదం వడ్డిస్తున్న సుబ్రమణ్యం తధితరులు

**తార్నాక, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 15వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తార్నాకలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తార్నాక సత్యసాయి సేవా సంస్థల కన్వీనగర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమాజ సేవే మాన జవితానికి అసలైన అధ్యయమన్నారు. సత్యసాయి బాబా చూపిన మార్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాడం ద్వార సమాజంలో మానవ విలువలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా అన్నదానం, మజ్జిగ పంపిణీ, పేదలకు దుస్తులు, నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కొండవీటి ప్రేమలత దేవి, చంద్రకళ, లక్ష్మీ రెడ్డి, సురేఖ కాంత, కామేశ్వరి, లక్ష్మీనాయుడు, సత్యవతి, గాయత్రి, ప్రేమలత, కిరణ్మయి, సుజాత, ఉదయ, కుమారి సాయి ప్రియ, మాణిక్యాలు, చంద్రమోళి రెడ్డి, అశోక్ కుమార్, చంద్రమోహన్, కె.వి.అప్పారావు, మురళీశంకర్ తదితరులు పాల్గొన్నారు.